సాక్షి
పెద్దపల్లి

శుక్రవారం । 26 ఏప్రిల్ । 2024



'తబిత' విద్యార్థులకు అభినందన

పెద్దపల్లిరూరల్: ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన రామగుండం తబిత ఆశ్రమ విద్యార్థులను గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. నల్లాల వద్ద స్నానాలు చేసిన భక్తులు తమతమ మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0/25.0

వాతావరణం ఎండగా ఉంటుంది. తీవ్ర వడ గాలులు వీచే అవకాశం ఉంది. రాత్రి వేళ కూడా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని/ముత్తారం: కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు వెంటనే ట్యాబ్‌లలో నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు, గంగాపురితో పాటు ముత్తారం మండలం మచ్చుపేట, లక్కారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు, అధికారులతో మాట్లాడి కొనుగోళ్ల తీరుపై ఆరా తీశారు. అదనపు కలెక్టర్ వెంట సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ముత్తారం తహసీల్దార్ సుమన్, మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్, ఐకేపీ ఏపీఎం పద్మ, సీసీలు తిరుపతి, రాజ్యలక్ష్మి, రాధిక, పీఏసీఎస్ సీఈవో దాసరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మలేరియా నియంత్రణకు ప్రణాళికలు



ర్యాలీలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, వైద్యులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మలేరియా మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుదామని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆవరణలో గురువారం చేపట్టిన అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే ఐదేళ్ల నాటికి మలేరియా మహమ్మారిని సంపూర్ణంగా నియంత్రించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా అత్యవసరమైతేనే అన్ని జాగ్రత్తలతో బయటకు రావాలన్నారు. వైద్యులు శ్రవణ్‌కుమార్, కీర్తన, అభినయ్, రామకృష్ణ, ఉమామహేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28న ఆర్‌జేసీ సెట్

పెద్దపల్లిరూరల్: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఈనెల 28న పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ కోఆర్డినేటర్ గౌతం కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పెద్దపల్లిలో 5 కేంద్రాలు, జగిత్యాలలో 8, కరీంనగర్‌లో 7, రాజన్న సిరిసిల్లలో 5 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష ఉదయం 10 గంటలకు మొదలవుతుందని, అభ్యర్థులను గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారని వివరించారు.

ఇక ప్రచార వేడీ

- ముగిసిన నామినేషన్ల జాతర
- కరీంనగర్‌లో 53 మంది అభ్యర్థులు.. 94 సెట్లు
- పెద్దపల్లిలో 63మంది అభ్యర్థులు.. 109 సెట్లు దాఖలు
- ఉమ్మడి జిల్లా ప్రచారానికి వస్తున్న గులాబీ బాస్
- బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల కోసం అగ్రనేతల రాక



రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గోమాస శ్రీనివాస్

సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: ఎన్నికల ప్రక్రియలో కీలక నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు మొత్తంగా 116 మంది అభ్యర్థులు 203 సెట్ల నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. చివరి రోజు అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు వరుసకట్టారు. గురువారం ఒక్కరోజే అత్యధికంగా కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి 27 మంది అభ్యర్థులు 32సెట్ల నామినేషన్లు వేశారు. పెద్దపల్లి ఎంపీ స్థానానికి 22 మంది అభ్యర్థులు 54 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చివరిరోజు కరీంనగర్, పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థులు బండి సంజయ్, గోమాసె శ్రీనివాస్ అట్టహాసంగా నామినేషన్లు వేశారు.

బరి నుంచి తప్పుకోకపోతే రెండు ఈవీఎంలు

శుక్రవారం నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. అందులో సరిగా లేనివాటిని తిరస్కరిస్తారు. ఇక 26 నుంచి 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. 29న తుదిబరిలో ఎందరు నిలుస్తారన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 15మంది అభ్యర్థులకు సంబంధించి గుర్తులతో ఒక ఈవీఎం ఉంటుంది. అందులో చివరిది నోటా గుర్తుకు కేటాయిస్తారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 15కు మించితే రెండు ఈవీఎంలను ఎన్నికల్లో ఉపయోగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కరీంనగర్ పార్లమెంట్‌కు 53 మంది అభ్యర్థులు, పెద్దపల్లికి 63 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ తరువాత ఎన్ని ఈవీఎంలు వినియోగిస్తారన్నది తేలనుంది.

పెరగనున్న ప్రచార జోరు

ఇక ప్రచార పర్వంపై ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుగా పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర మే 2న జమ్మికుంట, 3న రామగుండం, 5న జగిత్యాల, 9న కరీంనగర్, 10న సిరిసిల్లలో జరగనుంది. కాంగ్రెస్‌కు సంబంధించి పెద్దపల్లిలో మంత్రి శ్రీధర్‌బాబు, కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నీతామై వ్యవహరిస్తున్నారు. బీజేపీ తరఫున ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రచారం నిర్వహిస్తుండగా, మరికొందరు బీజేపీ జాతీయ నేతలు బహిరంగసభలకు హాజరై ప్రచార వేడిని పెంచనున్నారు.

ఒక్క నిమిషంతో ఇద్దరికి నో ఎంట్రీ



అధికారి కాళ్లు మొక్కేందుకు యత్నిస్తున్న హన్మయ్య

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి ఎంపీ సీటుకు నామినేషన్ వేసేందుకు వచ్చిన ఇద్దరు అభ్యర్థులు నిమిషం ఆలస్యంతో దాఖలు చేయలేకపోయారు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3గంటల సమయంలో రెవెన్యూ నోడల్ అధికారులు కార్యాలయం గేట్లు మూసివేశారు. అప్పుడే నామినేషన్ దాఖలు చేసేందుకు దళితబహుజన సమాజ్‌పార్టీ నేత మాతంగి హన్మయ్య, స్వతంత్ర అభ్యర్థి శ్రీకాంత్ అక్కడికి చేరుకోగా నిబంధనల ప్రకారం వారిని అనుమతించలేదు. అయితే తనను లోపలికి అనుమతించాలంటూ హన్మయ్య అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారిని బతిమాలాడు. సదరు అధికారి కాళ్లు మొక్కేందుకు యత్నించగా, వారించి అతడిని అక్కడి నుంచి పంపించేశారు. కరీంనగర్‌లో నామినేషన్ వేసి, పెద్దపల్లిలో వేయడానికి వచ్చానని, దీంతో లేట్ అయ్యిందని హన్మయ్య వాపోయాడు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకుని, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం ఎన్టీపీసీ ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రామగుండంలో మార్పు మొదలైందని, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేడీ మళ్లీ మాయమాటలు చెప్పడానికి మీ ముందుకు వస్తున్నారని, ప్రజలు ఆలోచించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల కోసం జీవో–22 అమలుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ, కార్మికులకు పెన్షన్ స్కీం అమలు చేసిన నాయకుడు కాకా వెంకటస్వామి అని గుర్తు చేశారు. కొప్పుల ఈశ్వర్ మంత్రిగా ఉన్నప్పుడు కార్మిక సమస్యలు పట్టించుకోలేదని, కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులో అవినీతికి పాల్పడి లక్షల కోట్ల రూపాయలు కేసీఆర్ దోచుకున్నారని ఆరోపించారు. వంశీని ఎంపీగా గెలిపించాలని కోరారు. వంశీకృష్ణ మాట్లాడుతూ, ఎంపీగా అవకాశం కల్పిస్తే కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, కార్పొరేటర్ కొలిపాక సుజాత, వెంగల పద్మలత, బొంతల రాజేశ్, మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు.

వీకెండ్ నాయకులకు గుణపాఠం తప్పదు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



కాల్వశ్రీరాంపూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

కాల్వశ్రీరాంపూర్/ఓదెల: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణ కుటుంబం వీకెండ్ నాయకులని, ఇక బీజేపీ అభ్యర్థి ఇప్పటివరకు ఎవరికీ కనిపించలేదని, ఎన్నికలప్పుడే కనపడతారని, ఎంపీ ఎన్నికల్లో వారికి గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రచారంలో భాగంగా గురువారం కాల్వశ్రీరాంపూర్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మన రాష్ట్రంలో పదవులు అనుభవిస్తున్న కాకా వారసులు పక్క రాష్ట్రాల్లో కంపెనీలు పెట్టి కోట్లు సంపాదిస్తూ నాయకులను, ఓటర్లను డబ్బుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. తాను లోకల్ అని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఓదెలలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీరు అందక పంటలు ఎండిపోయాయన్నారు. ఓదెలకు చెందిన పలువురు ఆయా పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గొడ్డు రాజకొమురయ్య, విండో చైర్మన్ పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావీశ్‌గుప్తా



సమీక్షలో సాధారణ పరిశీలకుడు రావీశ్‌గుప్తా, ఆర్‌వో ముజమ్మిల్‌ఖాన్, సీపీ శ్రీనివాస్ తదితరులు

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రావీశ్‌గుప్తా అన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల కలెక్టర్ సంతోష్‌తో పాటు సహాయ ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి వివిధ విభాగాలు చేసే కార్యక్రమాల నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. పత్రికల్లో వచ్చే పెయిడ్‌న్యూస్, ప్రకటనల వివరాలతో పాటు సీ విజిల్, 1950 ద్వారా అందే ఫిర్యాదులు, తనిఖీల్లో చేస్తున్న జప్తు వివరాలు ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. పోలింగ్ సమయంలో ఏజెంట్లు సెల్‌ఫోన్ వెంట తెచ్చుకోవద్దన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 15లక్షల 92 వేల పైచిలుకు ఓటర్లున్నారని వారందరికీ శుక్రవారం నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీసీపీ చేతన, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్ లాల్, ఆర్డీవోలు గంగయ్య, హనుమనాయక్, ఏసీపీలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దపల్లి పట్టణంలోని బాలుర, బాలికోన్నత పాఠశాల, మండలంలోని అప్పన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాలను గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకులు రావిశ్ గుప్తా పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి గంగయ్యకు సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



ముత్తారంలో నల్లా నీటిని పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

ముత్తారం(మంథని): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ముత్తారంలో వాటర్ ట్యాంకు, ఇళ్లలోని నలాలు, నర్సరీ, తడి పొడి చెత్త షెడ్డును పరిశీలించారు. డీపీవో వెంట డీఎల్‌పీవో శంకర్, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్ ఉన్నారు.

ఎన్టీపీసీ ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ సందర్శన



ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ వద్ద ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండుతో సీఎండీ బలరామ్‌నాయక్, అధికారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను గురువారం సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్ సందర్శించారు. ఈసందర్భంగా ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీనియర్ అధికారులతో చర్చించారు. నిరంతరాయంగా బొగ్గు సరఫరాకు పూర్తి సహకారం అందిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు.

అట్టహాసంగా బీజేపీ అభ్యర్థి గోమాస నామినేషన్



పెద్దపల్లిలో బీజేపీ శ్రేణుల ర్యాలీ

- ర్యాలీలో గుజ్జుల, సునీల్‌రెడ్డి వర్గీయుల తోపులాట
- ఎంపీ వెంకటేశ్ నేతకు తప్పని భంగపాటు

సాక్షి, పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా గోమాస శ్రీనివాస్ అట్టహాసంగా గురువారం నామినేషన దాఖలు చేశారు. కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ సమక్షంలో భారీ జనసమీకరణతో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి జెండా చౌరస్తా వరకు భారీ ర్యాలీగా వెళ్లి, అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం ప్రతిపాదకులతో కలసి గోమాసె శ్రీనివాస్ లోపలికి వెళ్లి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్‌కు నామపత్రాలను అందజేశారు.

బాహాబహికి దిగిన ఇరువర్గాలు

వ్యవసాయ మార్కెట్ నుంచి ర్యాలీ బయలుదేరగా, ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, కాసిపేట లింగయ్య పేర్లు పిలిచి వాహనంపైకి పిలవలేదని వారి అనుచరులు వాహనం బయలుదేరకుండా అడ్డుకున్నారు. దీంతో జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ర్యాలీ ముందుకు సాగడంలేదని చూసేందుకు రాగా, ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువర్గాలు ఒకరికొకరు తోసేసుకుని ఘర్షణ వాతావరణం నెలకొనగా, మాజీ ఎమ్మెల్యేలను వాహనంపైకి పిలవడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో పెద్దపల్లి నియోజకవర్గంలో వర్గ విభేదాలు నామినేషన్ సందర్భంగా మరోసారి బయటపడ్డాయి.

ఎంపీ వెంకటేశ్‌నేతకు ఆశాభంగం

వెంకటేశ్‌నేత చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడి పోయి, బీఆర్‌ఎస్‌లో చేరి 2019లో ఎంపీగా గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలోనే అందరికంటే ముందుగా బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారు. అయితే కాంగ్రెస్ ఎంపీ టిక్కెట్ రాకపోవడంతో, బీజేపీ టిక్కెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ల చివరిరోజు బీఆర్‌ఎస్ పార్టీ వివేక్‌ను పక్కకు పెట్టి తనకు బీఫాం అందించింది. ఈసారి సైతం ప్రకటించిన బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌ను పక్కకు పెట్టి తనకే బీఫాం ఇస్తారని ఆశించిన వెంకటేశ్‌నేతకు రిక్తహస్తమే మిగిలింది.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే జైలుకే

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



కమిషనరేట్‌లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని(రామగుండం): సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే జైలుకు వెళ్లాల్సిన ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం కమిషనరేట్ భవనంలో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. మీడియాలో పోస్టులపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికగా కొందరు వివిధ రాజకీయ పార్టీల నేతలను టార్గెట్‌గా చేసుకుని పోస్టులు పెడుతున్నారని, ఓ వర్గాన్ని కించపరుస్తూ పోస్ట్ చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో పుకార్లు ప్రచారం చేసినవారికి జైలుశిక్ష, జరిమానాతోపాటు కేసు తీవ్రతను బట్టి జీవిత ఖైదు పడే అవకాశం కూడా ఉంటుందన్నారు. అలాగే పోస్టులు ఫార్వర్డ్ చేసేముందు అవి నిజమా కాదా అని ఒకసారి ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. కొందరు ఐపీ అడ్రస్‌లు మార్చి ఏమార్చే ప్రయత్నాలు చేస్తున్నారని, వారిని కూడా వదలిపెట్టబోమన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీఐ ముత్తిలింగయ్య, ఎస్‌ఐ రాజమణి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలి



ఫిల్టర్‌బెడ్ సందర్శనలో సీఐటీయూ నాయకులు

గోదావరిఖని(రామగుండం): వేసవిలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి సూచించారు. ఆర్జీ–1 ఏరియాలోని గంగానగర్ ఫిల్టర్‌బెడ్‌ను గురువారం సందర్శించారు. రామగుండం రీజియన్‌లోని మూడు ఏరియాల కార్మికులు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రూ.18కోట్లతో నెలకొల్పనున్న నీటిశుద్ధి కేంద్రం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జీడీకే–5 ఓసీపీ, ఆర్జీ–1 ఓసీపీల నుంచి వెలుబడుతున్న దుమ్మును నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ పోరాటాలకు సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాం స్పందించడం సంతోషకరమన్నారు. అలాగే కార్మికుల చిరకాల కోరిక సొంతిల్లు అమలుకు కృషి చేయాలని, అందుకోసం ప్రతి కార్మికుడికి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మాణానికి రూ.30 లక్షలు చెల్లించాలన్నారు.

విడాకుల చిచ్చులో 'వివాహం'

పెళ్లి.. ఇద్దరు మనుషులనే కాదు.. రెండు కుటుంబాలనూ దగ్గర చేసే గొప్ప బంధం. వేదమంత్రాలతో చేసిన ప్రమాణాలతో కడదాకా కలిసుండాలన్నది దీని ఉద్దేశం.. రెండు తనువులు కాదు.. మనసులు కూడా ఒక్కటై, కష్టసుఖాల్లో తోడునీడగా ఉంటూ సాగించే అద్భుత ప్రయాణం. కానీ, నేటి సమాజంలో అన్యోన్యంగా ఒకరికొకరం అన్నట్టుగా గడపాల్సిన దంపతులు చిన్నపాటి మనస్పర్థలకే విడిపోతున్నారు. విడాకుల కోసం కోర్టు తలుపులు తడుతున్నారు. పెళ్లయిన కొన్ని రోజులు, నెలలు, ఏడాదికే విడాకులు కావాలంటూ కోర్టును ఆశ్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మన భారతీయ వివాహ వ్యవస్థ విడాకుల చిచ్చులో చిక్కుకుపోతోంది.



'కరీంనగర్‌లోని ఒక జంటకు వివాహమై, 45 రోజులైంది. ఆ తర్వాత రోజే సదరు మహిళ ఒక న్యాయవాది వద్దకు వెళ్లి, నాకు విడాకులు కావాలని కోరింది. న్యాయవాది ఆశ్చర్యపోయి, మరోసారి ఆలోచించి, సర్దుకుపోవాలని సూచించగా ససేమిరా అంది. కచ్చితంగా అతనితో జీవితం కొనసాగించలేనని తేల్చిచెప్పింది.'

'కరీంనగర్‌కు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువతి, నగరానికి చెందిన యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరి మధ్య ఒక శుభకార్యం విషయంలో చిన్న గొడవ జరిగింది. అది కాస్తా పెద్దదవడం పలు పంచాయితీలు జరిగినా దంపతులు కలవకపోవడంతో విడాకుల వరకు వెళ్లింది.' ఇలా చాలాచోట్ల చిన్న చిన్న గొడవలు, కారణాలతో పచ్చని సంసారాలు కూలిపోతున్నాయి.

- సర్దుకుపోయే మనస్తత్వమేది?
- చిన్న గొడవలకే విడిపోతున్న దంపతులు
- ఏడాదిలోపే ఠాణాలు, కోర్టుల మెట్లెక్కుతున్న వైనం
- ఏటా పెరుగుతున్న కేసులు
- ఒక్క కరీంనగర్ కోర్టులోనే 300కు పైగా నమోదు
- ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మన వివాహ వ్యవస్థ పరిస్థితి

కరీంనగర్‌క్రైం: అదిగో పెళ్లి.. ఇదిగో విడాకులు అన్నట్లుగా ఉంది వివాహాల పరిస్థితి. విడాకులు కోరుకునేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. గతంలో పురుషులు ఉద్యోగం చేయాలి.. మహిళలు ఇల్లు చక్కదిద్దాలి అన్నట్లుగా ఉండేది. కానీ, ఇప్పుడు తీరు మారింది. పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. గతంలో పోల్చితే నగరంలో ఆర్థిక స్వేచ్ఛ పెరిగింది. సంపాదనలో ఆడ, మగ సమానంగా ఉంటున్నారు. కరీంనగర్ కోర్టులో ఏటా 300కు పైగా విడాకుల కేసులు నమోదవుతున్నాయి. పోలీస్‌స్టేషన్లలోనూ భార్యాభర్తల గొడవల కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి.

గతంలో సర్దుకునేవారు..

గతంలో గొడవలు వస్తే కుటుంబంలోనే సర్దుకునేవారు. మాంగళ్య బంధం విలువ, పరువు గురించి ఆలోచించేవారు. ఒకసారి వివాహమైన తర్వాత జీవితాంతం తన భాగస్వామితోనే ఉండాలని ఇరు వర్గాలవారు నిర్ణయించుకునేవారు. కానీ, ఇప్పుడు కుటుంబంలో సమస్యలు వస్తే కొందరు సర్దుబాటు చేసుకోవడం లేదు. తక్కువ వయసులో పెళ్లి చేసుకున్న ఎక్కువ మంది విడాకులు తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు. అందులోనూ.. ప్రేమ పెళ్లిళ్లు చేసుకుంటున్నవారు ఏడాది గడవక ముందే ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. కలిసి బతకలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు కోర్టులు కూడా చట్టబద్ధంగా విడాకులు మంజూరు చేస్తున్నాయి. కరీంనగర్ ఫ్యామిలీ కోర్టులో ఏటా విడాకుల కేసులు పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

విడాకులకు ప్రధాన కారణాలివే..

- ఉద్యోగం చేసేవారిలో ఆర్థిక స్వేచ్ఛ.
- వివాహేతర సంబంధాలు.
- దంపతుల విషయాల్లో కుటుంబసభ్యులు, ఇతరుల మితిమీరిన జోక్యం.
- బంధాల విలువ తెలియకపోవడం.
- ఆడంబరాలకు పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడటం.
- అనుమానం.
- సర్దుకుపోయే మనస్తత్వం లేకపోవడం.

తొందరపాటు నిర్ణయాలొద్దు..



దంపతుల మధ్య గొడవలు వచ్చినప్పుడు తొందరపాటు నిర్ణయాలొద్దు. తల్లిదండ్రులు సర్దిచెప్పాలి. బంధాల విలువను తెలియజేస్తూ వారి మధ్య మనస్పర్థలు తొలగిపోయేలా చూడాలి. ఆవేశానికి పోయి పచ్చటి సంసారాలను నాశనం చేసుకోవద్దు. ఈ మధ్య భార్యాభర్తల గొడవలు విపరీతంగా పెరిగాయి. మా వద్దకు వచ్చిన ఫిర్యాదుల్లో చాలా మంది దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి, కలిపాం.

– శ్రీలత, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ, కరీంనగర్

కౌన్సెలింగ్‌తో చక్కదిద్దే ప్రయత్నం..

కరీంనగర్ జిల్లాలో భార్యాభర్తల మధ్య గొడవలు తలెత్తితే ఎక్కువ శాతం మంది కరీంనగర్‌లోని మహిళా ఠాణాను ఆశ్రయిస్తున్నారు. 2023లో 943 ఫిర్యాదులు రాగా, 86 కేసులు నమోదయ్యాయి. 2024లో 306 ఫిర్యాదులు రాగా, 29 కేసులు నమోదు చేశారు. మిగతా వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, రాజీతో కాపురాలు చక్కదిద్దారు. కరీంనగర్ ఫ్యామిలీ కోర్టులో 2023లో 136, 2024లో 73 కేసులు నమోదయ్యాయి. సఖీ కేంద్రం ద్వారానూ దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఇరువర్గాల మధ్య రాజీ కుదుర్చుతున్నారు. పోలీసులు, సఖీ కేంద్రం వారు ఎంత చెప్పినా వినని కొందరు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఇంట్లో చిందరవందరగా వస్తువులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామానికి చెందిన పోచంపల్లి లక్ష్మి ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. లక్ష్మి ఇటీవల తన బంధువుల ఇంటికి వెళ్లి, గురువారం తిరిగి వచ్చింది. ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించింది. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకొని, స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందించింది. వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు ఐదున్నర తులాల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలు, రూ.42 వేలు చోరీ అయ్యాయని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఫాం ఏ, బీ.. డమ్మీ అభ్యర్థి అంటే..?

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా గోమాసె శ్రీనివాస్‌ను ఎంపిక చేసిన అధిష్టానం, తనతో పాటు ఎస్.కుమార్‌కు సైతం బీ ఫాం అందజేసింది. దీంతో చాలామంది ఇద్దరికీ బీ ఫాం ఎలా ఇచ్చారు? అలా ఇవ్వొచ్చా లేదా అనే అనుమానాలున్నాయి. ఈ ఫాంలకు సంబంధించి ఎన్నికల సంఘం రూపొందించిన విధివిధానాలు ఇలా ఉన్నాయి.



ఫాం ఏ అంటే..

ఒక పార్టీ అధ్యక్షుడు లేదా కార్యదర్శి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థుల వివరాలతో ఫాం బీ (బీ ఫాం) జారీ చేయడానికి స్థానిక పార్టీ నాయకుడికి అధికారం ఇవ్వొచ్చు. అలా ఫాం ఏ ద్వారా అధీకృతుడైన వ్యక్తి తమ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థుల పేర్లతో ఫాం బీ ని జారీ చేస్తారు. ఆ ఫాంను నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. దీంతో ఫాం ఏ సూచించే వ్యక్తికే బీ ఫాం పొందినట్లు అవుతుంది. అతడికే పార్టీ గుర్తు వస్తుంది.

ఫాం అంటే..

అభ్యర్థి తన నామపత్రంలో ఏదేని గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల, రిజిస్టర్ రాజకీయ పార్టీల అభ్యర్థిగా ప్రకటించినట్లయితే సంబంధిత పార్టీ నుంచి అధీకృత బీ ఫాంను రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లేదా కార్యదర్శి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థుల వివరాలను రాసి సంతకం చేసి, పార్టీ ముద్ర వేసి బీ ఫాంను నేరుగా రిటర్నింగ్ అధికారికి పంపవచ్చు లేదా పార్టీ ఇచ్చిన బీ ఫాంను అభ్యర్థి నామినేషన పత్రాలతో పాటు జతచేసి రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. బీ ఫాం ఉన్న వ్యక్తికి ఆయా పార్టీ సింబల్ కేటాయిస్తారు.

ఇద్దరికి బీ ఫాం ఇస్తారా..?

ఏదైనా పార్టీ ఒక్క స్థానంలో ఒక్కరికి మాత్రమే బీ ఫాం ఇస్తుంది. ఒక్కరికి మించి ఇవ్వడం కుదరదు. కానీ ఇద్దరి పేర్లతో బీ ఫాం అందజేస్తాయి. పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థితో పాటు డమ్మీ అభ్యర్థితో నామినేషన్ వేయిస్తుంది. ఎందుకంటే ప్రధాన అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో దోషాలు, టెక్నికల్ సమస్యలు ఎదురై అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైతే, ప్రత్యామ్నాయంగా డమ్మీ అభ్యర్థికి బీ ఫాం అందజేసి ఎన్నికల బరిలో నిలిపేందుకు వీలుగా ఇద్దరికీ బీఫాంలు ఇస్తారు. ప్రధాన పార్టీ అభ్యర్థి నామినేషన్ ఓకే అయితే ఆ అభ్యర్థికే బీ పాం ఇచ్చినట్లు ఏ ఫాంను ఆర్వోకు అందిస్తారు. దీంతో డమ్మీ అభ్యర్థి తన నామినేషను విత్‌డ్రా చేసుకుంటాడు.

ముగ్గురిపై కుక్క దాడి

బోయినపల్లి(చొప్పదండి): కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గురువారం పిచ్చికుక్క దాడి చేయడంతో కిరణ్, లచ్చయ్య, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వారు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందారన్నారు.

సీనియర్ సివిల్ జడ్జికి సత్కారం



సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్‌ను సత్కరిస్తున్న సభ్యులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి సబ్‌కోర్టు సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్ బదిలీపై వెళ్తున్న సందర్భంలో గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సత్కరించారు. పలువురు న్యాయవాదులు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

రూ.2లక్షల పట్టివేత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా జెండా చౌరస్తాలో రూ.2లక్షలను రాజేశం అనే వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగిచినట్టు ఎస్సై మల్లేశ్ తెలిపారు. పూర్తి ఆధారాలు చూపించి నగదు తీసుకెళ్లవచ్చని వారికి వివరించినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం కాపులపల్లి గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై మల్లేశ్ తెలిపారు.

కాలిపోయిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్



కథలాపూర్(వేములవాడ): బొమ్మెన శివారులోని గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా తెలిపారు. రూ.35 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. తక్కళ్లపెల్లి శివారు ధాన్యం కొనుగోలు కేంద్రంలోని టార్పాలిన్ గురువారం సాయంత్రం గాలికి ఎగిరి, విద్యుత్ వైర్లపై పడటంతో సంఘటన చోటుచేసుకుందన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, డీఈ తిరుపతి, ఏడీఈ రఘుపతి మరమ్మతు చేయించి, విద్యుత్ సరఫరా జరిగేలా చూశారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



పొలంలో నర్సయ్య మృతదేహం

జగిత్యాల క్రైం: కోతకు వచ్చిన పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేటకు చెందిన నలువాల నర్సయ్య (58) ఇదే గ్రామానికి చెందిన పొలాస శివారులోని ఓ రైతు భూమిని కౌలుకు తీసుకొని, వరి సాగు చేశాడు. పొలం కోతకు రావడంతో గురువారం ఉదయం పరిశీలించేందుకు వెళ్లాడు. అప్పటికే విద్యుత్ వైరు తెగి పొలంలో పడగా.. నర్సయ్య చూసుకోలేదు. అలాగే నడుస్తూ వెళ్లగా విద్యుత్ వైరు అతని కాళ్లకు తగలడంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే పరామర్శ

నర్సయ్య మృతి విషయం తెలుసుకున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

గుండెపోటుతో యువకుడు..



కిరణ్ (ఫైల్)

చొప్పదండి: పట్టణానికి చెందిన కల్లెపల్లి కిరణ్(32) గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చొప్పదండి పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన కిరణ్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో ఎండ వేడికి తాళలేక రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. గురువారం ఉదయం చాతిలో నొప్పి వస్తోందని కుటుంబసభ్యులు చెప్పడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు అవివాహితుడు. అతని తండ్రి కూడా 15 ఏళ్ల క్రితం గుండెపోటుతోనే చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. కిరణ్‌కు తల్లి, సోదరి ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన సుద్దమల్ల నిరీక్షణ్(30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నిరీక్షణ్ గతంలో సిరిసిల్లలోని వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేశాడు. తనకు పరిచయమైన యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. కానీ, ఆరు నెలలుగా ఏ పనీ చేయకుండా ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో ఉరేసుకున్నాడు. మెడికల్ రిపోర్టు వచ్చాక అన్ని వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి దేవరాజు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

కోరుట్ల రూరల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కోరుట్ల రూరల్ మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన ములాంగిరి సాయిలు(45) గురువారం ఊరి పక్కనే శ్మశానవాటిక వద్దనున్న వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వాగు పైనుంచి వెళ్తున్న హైటెన్షన్ తీగలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ వైర్లు తగిలించి, నీళ్లలో వదిలాడు. చేపలు పడ్డాక వాటిని తొలగించి, తీసుకోవచ్చని అనుకున్నాడు. ఇంతలో కాలు జారి నీళ్లలో పడటంతో విద్యుత్‌షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. కూలీ పని చేసుకునే సాయిలుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కట్టెలు మీదపడి వృద్ధురాలు..

మల్యాల(చొప్పదండి): ఇంట్లో దాచిన కట్టెలను కిందికి దించే క్రమంలో అవి మీదపడి ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మల్యాల మండలంలోని ముత్యంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. ముత్యంపేటకు చెందిన మర్రి రాజేశ్వరి(80) వంట చేసుకునేందుకు ఉపయోగించే కట్టెలను తన ఇంట్లో నిల్వ చేసింది. గురువారం వాటిని తీస్తుండగా, ఒక్కసారిగా మీదపడ్డాయి. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడి, చనిపోయింది. మృతురాలి సోదరుడు ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్‌లో 'అల్ఫోర్స్'కు ర్యాంకుల పంట



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఐఐటీ–జేఈఈ మెయిన్–2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. తెలంగాణ, మహారాష్ట్రలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్ విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి గురువారం సన్మానించారు. ఎం.హర్షిత్ 252, ఎ.వర్ధన్‌రావు 444, పి.మనోహర్ 466, జి.శ్రీహాస్ 503, బి.భరద్వాజ్ నాయక్ 781, పి.చందన 1,213, సత్యఅమూల్య 1,301, సుబోధ్‌చాదరి 1,367, కె.శ్రీనిధి 1,562, ఎండీ.షఫీక్ 1,603, మిత్ర 1,612, సీహెచ్.అనూహ్య 1,632, ఎ.శివవరుణ్ 1,719, ఎస్.ప్రణయ్ 1,721, పి.రాహుల్ 1,751, ఎం.ప్రణీత్ రెడ్డి 1,912, జె.ఉమామైత్ర 1,953, ఎల్.అరుణ్‌కుమార్ 2,353, సీహెచ్.సిద్దార్థ 2,444, పి.రాఘవీరారెడ్డి 2,510, కె.విశాల్ రెడ్డి 2,557, కె.రోహన్‌ప్రీత్ 2,643, జె.హర్షవర్ధన్ 2,908, జి.లహరి 2,965వ ర్యాంకు సాధించి, అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపజేశారని అన్నారు. అలాగే, 1,000 లోపు 5 ర్యాంకులు, 5,000 లోపు 34 ర్యాంకులు వచ్చాయన్నారు. మొత్తం 461 మంది ఐఐటీ(అడ్వాన్స్‌డ్) పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు. పిల్లలకు అత్యుత్తమ అధ్యాపక బృందంచే ప్రత్యేక కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

'ట్రినిటీ' విద్యార్థుల ప్రతిభ



ర్యాంకర్లతో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ఉత్తమ ర్యాంకులు సాధించారు. జె.హానికర్ 48, డి.గణేశ్‌రావు 485, ఎం.చిత్రాంజలి 532, ఎ.రఘుపతి 789, ఎల్.జశ్వంత్ 910, సీహెచ్.శివ 1,397, ఎస్.సుమంత్ 1,473, బి.వర్షిత రాణి 1,626, ఆర్.నిఖిల్ 2,279, ఎం.ధనుంజయ్ 2,464, సీహెచ్.ఆశిష్ నాయక్ 3,113, ఎ.గంగాధర్ 3,289, పి.శ్రీజ 4,563, జె.కీర్తి 4,633, డి.దేవేందర్ 4,836, ఎల్.చంద్రపతి 4,883, ఎం.హిమబిందు 5,210, బి.అర్పిత్ గౌడ్ 5,310, బి.సందీప్ 5,685, బి.వంశీకృష్ణ నాయక్ 5,964, వి.శ్రీతేజ 6,262వ ర్యాంకు సాధించారు. విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. చక్కని ప్రణాళిక, పరీక్షల్లో విద్యార్థులు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు సరిచేయడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. తమ కళాశాలలో చదివిన నందాల సాయికిరణ్ యూపీఎస్సీలో 27వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి అభినందించారు.

'శ్రీ చైతన్య' విజయదుందుబి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం

కరీంనగర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయదుందుబి మోగించారని చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. పింగిలి వెన్నెల 27వ ర్యాంకు, రాపోలు శ్రీవాణి 601, మణిదీప్ రెడ్డి 952, ఓ.రిత్విక 986, కె.రోహిత్ 1,399, బి.హారిక 4,359, ఇ.సూర్యకాంత్ 10,832, మాధవి జ్యోతిర్మయి 11,592, పి.హాసిని 14,317, కె.శ్రీనిత్ 25,121, ఎం.శ్రీవిద్య 25,539, పి.వర్షిణి 33,892వ ర్యాంకు సాధించారన్నారు. పరీక్షకు హాజరైన వారిలో 60 శాతం మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. నిత్యం పర్యవేక్షించడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. విద్యార్థులను చైర్మన్ రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ నరేందర్ రెడ్డి, డీన్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి తిరుపతి


'ఎస్ఆర్' విజయకేతనం

తిమ్మాపూర్(మానకొండూర్): జేఈఈ మెయిన్ ఫలితాల్లో కరీంనగర్ ఎస్ఆర్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి మాట్లాడుతూ.. కరీంనగర్ కళాశాలకు చెందిన కొమ్మిడి రమణారెడ్డి 211వ ర్యాంకు, గౌడుగుల ఉదయ్ 497, పెద్ది మారుతి 730, సచ్చిదానంద 1,510, రాజీవ్ 1,789, శ్రీ వాత్సవ్ 3,822, క్షేత్ర 4,181, రిషిత్ 4,931, నరేశ్ 5,687, రమావతి 6,668, ప్రసన్న 6,809, వినూత్న 7,540వ ర్యాంకు సాధించారని తెలిపారు. సంవత్సరం వృథా కాకుండా, లాంగ్‌టర్మ్ కోచింగ్ లేకుండా ఇంటర్ పూర్తవగానే తమ విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగార్జునరెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఇన్‌చార్జి అశోక్, ప్రసాద్ అభినందించారు.


'పారమిత' ప్రభంజనం



కృష్ణతేజ



దినేశ్‌రెడ్డి



అనురాగ్



మనస్విని

కరీంనగర్: జేఈఈ మెయిన్‌లో పారమిత విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పారమిత–క్షేత్ర పాఠశాల నుంచి మొత్తం 79 మంది పరీక్ష రాయగా ఎస్.కృష్ణతేజ 98.63 పర్సంటైల్ సాధించి, అగ్రస్థానంలో, ఎం.దినేశ్ రెడ్డి 96.79 పర్సంటైల్‌తో ద్వితీయ స్థానం, జి.అనురాగ్ 96.65 పర్సంటైల్‌తో తృతీయ, జి.మనస్విని 96.47 పర్సంటైల్‌తో నాలుగో స్థానంలో నిలిచారని, మొత్తం 17 మంది ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని చైర్మన్ ఈ.ప్రసాదరావు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్‌తోపాటు విద్యాసంస్థల డైరెక్టర్ రశ్మిత, అనూకర్‌రావు, ప్రసూన, వి.యు.ఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, సమన్వయకర్త నాగరాజు గురువారం అభినందించారు.